క్లుప్తంగా

నేడు వెంకన్న కల్యాణం



కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి

అంబాజీపేట: అంబాజీపేట కొర్లపాటి వారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూసమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 19న స్వామి వారి తీర్థం నిర్వహించనున్నామన్నారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చి వెంకన్న ఆశీర్వాదాలు స్వీకరించాలన్నారు.

నేడు అమ్మవార్ల జాతర



బొక్కావారిపాలెంలో కొలువుదీరిన అమ్మవార్లు

మామిడికుదురు: పెదపట్నంలంక బొక్కావారిపాలెంలో కొలువుదీరిన మహాలక్ష్మమ్మ, వనువులమ్మ వార్ల జాతర శనివారం రాత్రి జరుగుతుందని ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. అమ్మవారికి ఆదివారం భక్తులు నైవేద్యాలు చెల్లిస్తారని, అదే రోజు మధ్యాహ్నం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ పేర్కొంది. జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాల వెలుగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మామిడి తోరణాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు.

నేటి నుంచి వాసవీ మాత ఆవిర్భావ వేడుకలు

అంబాజీపేట: స్థానిక బస్‌స్టేషన్ వద్ద వేంచేసిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కాసు శ్రీనివాసరావు, కార్యదర్శి గోకవరపు శివ, కోశాధికారి బొండాడ శివ తెలిపారు. 18న సుప్రభాత సేవ, 19న ఉమాచంద్రమౌళి అర్ధనారీశ్వర స్వామి వారి కల్యాణం, 23న పుష్పోత్సవం నిర్వహించనున్నామన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఈతకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరునగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గ్రామీణ పేదల ఆరోగ్య రక్షణకు జాస్



ఆలమూరులో నిర్వహించిన జాస్‌లో వైద్య సేవలు అందిస్తున్న వైద్యారోగ్యశాఖ

ఆలమూరు: రాష్ట్రంలోని గ్రామీణ పేద ప్రజల ఆరోగ్య రక్షణకు, మెరుగైన చికిత్స కోసం ఈ ఏడాది జనవరి నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్)ను ప్రవేశ పెట్టిందని ప్రత్యేక వైద్య నిపుణులు జి.దుర్గాప్రసాద్, మేఘ స్పందన, నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులో శుక్రవారం జాస్ ఫేజ్–2 కార్యక్రమం జరిగింది. పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.సాయి కిషోర్ నేతృత్వంలో వైద్యారోగ్య అధికారులు, సిబ్బంది సుమారు 267 మందికి వైద్య సేవలను అందించి ఉచితంగా మందులను అంద జేశారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. దీర్ఘ వ్యాధిగ్రస్తులకు వైద్య సలహాలు సూచనలు తెలియజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న వారిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వి.వేణి, సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఎంఎల్‌హెచ్‌పీలు కె.సుమాంజలి, శ్వేత, ఆరోగ్య మిత్ర నామాల రామకృష్ణ, ఆరోగ్య ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

అయినవిల్లి: మండలంలోని 21 గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సుమారుగా 5 వేల మంది ఉపాధి పనులు చేస్తున్నట్లు ఏపీఓ నాగబాబు తెలిపారు. కొబ్బరి చెట్ల వద్ద పళ్లాలు వేయడం, పంటకాలువలు, పంటబోదెల్లో పూడికతీత పనులు, తుప్పలు తొలగింపు వంటి పనులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ పనులను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

కనుమరుగవుతున్న కాలువ చేపలు

- రసాయన వ్యర్థాలతో ముప్పు
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు

ఆత్రేయపురం: గోదావరి సెంట్రల్ డెల్టాకు సాగు నీరు నిలుపుదల చేయడంతో మత్స్యకారులు మత్స్య సంపద వేటలో నిమగ్నమయ్యారు. కోనసీమ పరిధిలోని లొల్లలాకుల ద్వారా ప్రధాన పంట కాలువల్లో కొత్తపేట, ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు తదితర మండలాల్లో ప్రధాన పంట కాలువల్లో అడ్డుకట్టులు వేసి చేపల వేట సాగిస్తున్నారు. ప్రస్తుతం కాలువల్లో దొరికే చేప రకాల్లో 'పులస' తరువాత అంతటి ప్రాధాన్యం సంతరించుకున్న కాలువ చేపలు క్రమేపీ కనుమరుగవుతున్నాయి. గతంలో కాలువలు మూసివేసిన వెంటనే అధిక సంఖ్యలో లభ్యమయ్యే బొమ్మిడాలు, కొరమేనులు, పిత్త పరిగెలు, గొరసలు నేడు మచ్చుకైనా కానరావడం లేదు. మత్స్యకారులు చేపల వేట కొనసాగించినా చేపలు లభ్యం నామమాత్రం కావడంతో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారు. ఆంధ్ర జలచరాల వంటకాల్లో ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ జలపుష్పాలు కాలక్రమేణ కనుమరుగవడం మాంసాహారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఇదే పరిస్థితి మరో పదేళ్లు కొనసాగితే కాలువ చేపలు పూర్తిగా అంతరించిపోతాయని మత్స్యకార నిపుణులు హెచ్చరిస్తున్నారు. బొమ్మిడాలు, కొర్రమీనులు మన సంప్రదాయ చేపలు. ఇవి బురద, జలాశయాల అడుగు భాగంలో జీవిస్తాయి. పంట కాలువలు, బోదెల్లో ఎక్కువగా మట్టగిడసలు, బొచ్చులు, బొమ్మిడాలు కూడా ఏప్రిల్ నెలలో కాలువలు మూసివేసిన తరువాత ఈ రకం చేపలు ఒకప్పుడు అధికంగా లభించేవి. రుచిలో మేటి అయిన ఈ చేపలు కాలువలు మూసివేసిన తరువాత వేటకు చిక్కక పోవడం మాంసాహార ప్రియులకు ఆందోళన కలిగిస్తుంది. అంతరించిపోతున్న ఈ చేపలు మార్కెట్‌లో అరుదుగా దొరకడంతో వీటి ధర చుక్కలను తాకుతుంది. బొచ్చు, చైనా చేప రకాల ధర రూ.120 ఉంటే, బొమ్మిడాలు, కొరమేనులు ధర రూ.250 వరకూ ఉంది. ఏడాదిలో ఒకసారైనా కొనుగోలు చేద్దామనుకున్న వారి సంఖ్య నానాటికి పెరగడం ఈ పరిస్థితికి అద్దంపడుతుంది. మత్స్య శాఖ దృష్టి సారించి అంతరించి పోతున్న జలపుష్పాలను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని మత్స్యప్రియులు కోరుతున్నారు.



కాలువలో చేపలు కోసం వేట సాగిస్తున్న మత్స్యకారులు



కాలువలో పడిన చేపలు

మత్స్య సంపదను కాపాడాలి



జలాశయంలో పెరుగుతున్న మత్స్య సంపద నానాటికి కనుమరుగవుతుంది. భావి తరాలు తెలుసుకోకుండా అంతరించిపోతున్న సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. విచక్షణా రహితంగా రసాయనిక పురుగు మందులు వినియోగం ఆపై కాలువల్లో వదలడం ద్వారా మత్స్య సంపద వినాశనానికి దారి తీస్తున్నందున రసాయనాల వినియోగం తగ్గించాలి.

– ఈదరపల్లి సుబ్బరాజు, ఆత్రేయపురం

మత్స్య సంపద కరవు



కాలువల్లో చేపలు వేట ప్రారంభం కావడంతో కొనుగోలు చేసేందుకు వెళ్లుతుండగా చేపలు దొరకడం లేదు. కొన్ని జాతుల చేపలు కనుమరుగవడంతో అ చేపలను తినేందుకు వెళ్లుతున్న మాంసాహార ప్రియులకు అ సంపద లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు.

– ముదునూరి నాగరాజు, ఆత్రేయపురం

అడ్డుకట్టలు ఏర్పాటు చేయవద్దు



మత్స్యకారుల ఉపాధి నిమిత్తం పలు సంఘాలకు ప్రతి ఏడాది మాదిరిగానే నామమాత్రపు లీజుకు వేట సాగించేందుకు అనుమతులు ఇస్తున్నాం. కాలువల్లో మత్స్యకారులు వేట సాగించుకోవాలే తప్ప అడ్డుకట్టులు ఏర్పాటు చేయకూడదన్నారు.

– పిల్లా సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ, లొల్లలాకుల సెక్షన్

సంపూర్ణ పారిశుధ్యంతో మెరుగైన ఆరోగ్యం

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీని వల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీహెచ్ఈవో ఎన్‌వీ రామారావు, సీహెచ్‌వో బి.అప్పారావు అన్నారు. మాచవరంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివాస ప్రాంతాల మధ్య ఎటువంటి చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం దోమల నివారణకు స్ప్రే చేయించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వి.మురళీకృష్ణ, ఏఎన్ఎం అర్జమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం

రాజోలు: రాబోయే ఎన్నికల ఫలితాల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం ఖాయమని వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ధీమా వ్యక్తం చేశారు. గొల్లపల్లి మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గ ప్రజలు తనను ఎంతగానో ఆదరించారన్నారు. వైఎస్సార్ సీపీ కుటుంబం అక్కున చేర్చుకుని ప్రేమాభిమానాలు చూపించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గొల్లపల్లి సూర్యారావు–లూథియమ్మ పెళ్లిరోజు వేడుకలు శుక్రవారం తాటిపాకలో ఘనంగా నిర్వహించారు. రాజోలు నియోజకవర్గంలోని రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొని గొల్లపల్లి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను సూర్యారావు, లూథియమ్మ దంపతులు కట్ చేశారు.



గొల్లపల్లి దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

గుట్టుచప్పుడు కాకుండా ఇసుక తరలింపు

- జగనన్న కాలనీ ఇళ్లకు కేటాయించిన ఇసుక
- పోలీసులకు ఫిర్యాదు

రాజోలు: జగనన్న కాలనీలలో నిర్మాణాల కోసం రాజోలు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో స్టాక్ పాయింట్‌లో ఉంచిన ఇసుకను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా తరలించుకుపోతున్నారు. స్టాక్ పాయింట్‌లోని ఇసుకను గృహనిర్మాణ లబ్ధిదారులకు మాత్రమే కూపన్లు ఇచ్చి గృహనిర్మాణ శాఖ అధికారులు పంపిణీ చేస్తారు. అయితే గత కొంతకాలంగా స్టాక్ పాయింట్‌లోని ఇసుకను కొందరు ప్రైవేటు వ్యక్తులు దర్జాగా జేసీబీని ఉపయోగించి ట్రాక్టర్లల్లో ఇసుకను లోడ్ చేసి, ఇసుకను తరలించుకుపోతున్నారు. స్టాక్ పాయింట్‌లోని ఇసుక సగం మేర ఖాళీ అయిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల పురస్కరించుకుని ఎన్నికల కోడ్ నేపథ్యంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇసుక టోకెన్లు ఇవ్వలేదని గృహనిర్మాణ శాఖ అధికారులు తెలిపారు. గతంలో రెండు, మూడు పర్యాయాలు ఇసుక తరలించుకుపోయినట్టు తమకు ఫిర్యాదులు వచ్చాయని, అయితే ఇసుక తరలింపుపై నిఘా ఉంచామన్నారు. ఇసుక తరలించుకుపోతున్న ట్రాక్టర్లపై పోలీసులకు ఫిర్యాదు చేశామని హౌసింగ్ ఏఈ సత్యనారాయణ తెలిపారు.



రాజోలు స్టాక్ పాయింట్ నుంచి ట్రాక్టర్‌పై ఇసుక తరలించుకుపోతున్న దృశ్యం

సేంద్రియ ఎరువులపై రైతుల ఆసక్తి

అంబాజీపేట: సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గుర్తిస్తున్న పలువురు రైతులు భూసారం పెంపుపై దృష్టి సారిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలనిచ్చే సేంద్రియ ఎరువులను వినియోగిం చాలని వ్యవసాయాధికారుల సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పశువుల పేడ, మేకలతో దండి కట్టడం, చెరువులు, కుంటల్లో పూడిక మట్టిని పొలాల్లో వేసుకుంటున్నారు. మరి కొందరు ఇతర రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. అనేక మంది రైతులు ఈ సేంద్రియ సాగు విధానానికి సన్నద్ధమవుతున్నారు. తరచూ రసాయన ఎరువుల వినియోగం వల్ల భూసారం తగ్గి పంటలకు చీడపీడలు సోకి ఉత్పత్తులు తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పశువుల పేడ, పూడిక మట్టి వేయడం వల్ల భూసారం పెరగడమే కాకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయన్నారు. అంతేగాక భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండి పోకుండా దోహదపడతాయన్నారు. సేంద్రియ ఎరువులు వాడిన పొలాల్లో చీడపీడలు, తెగుళ్లు సోకవన్నారు. చెరువు మట్టి, పశువుల పేడలో నత్రజని, భాస్వరం, జింక్, మెగ్నీషియం, ఐరన్, పొటాష్, బోరాన్ వంటి పోషక విలువలు లభించడంతో పైర్లు అధిక దిగుబడి ఇస్తాయన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

- కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్, ఒకేషనల్ గ్రూపులు
- ఉత్తమ విద్యాబోధన, ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

కొత్తపేట: 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులై ఇంటర్మీడియెట్‌లో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో జనరల్, ఒకేషనల్ గ్రూపులు, ఉత్తమ విద్యా బోధన, ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు తదితర అంశాలను వివరించారు.

కళాశాలలో జగనల్, వృత్తి విద్యా కోర్సులు

కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు తెలుగు, ఇంగ్లీషు మీడియంతో పాటు వృత్తి విద్యా (ఒకేషనల్) కోర్సులైన ఏఈటీ, సీఎస్ఈ, ఈటీ, ఎంఈపీటీ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యు (ఎఫ్) గ్రూపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అతి తక్కువ ఫీజులతో పూర్తి స్థాయిలో అన్ని సౌకర్యాలు ముఖ్యంగా సువిశాలమైన గ్రంథాలయం, సైన్స్ ప్రయోగశాలలు ఉన్నాయన్నారు.



ప్రిన్సిపాల్ లక్ష్మణరావు

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఈ కళాశాలలో మంచి అనుభవం ఉన్న అధ్యాపకులతో విద్యాబోధన ద్వారా విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిన ఘనత ఈ కళాశాలకు ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహకాలతో పాటు ఉత్తమ విద్యార్థులకు పూర్వ విద్యార్థుల గ్రూపులు, దాతల నగదు డిపాజిట్ల ద్వారా వచ్చే నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ వసతులను, సౌకర్యాలను విద్యార్థులు స్వయంగా చూసి ఈ కళాశాలను ప్రవేశాలు పొంది ప్రభుత్వ ఇంటర్మీడియెట్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిగ్రీ కళాశాల ప్రవేశానికి దరఖాస్తులు

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం డిగ్రీలో చేరే విద్యార్థులకు అడ్మిషన్లు జరుగుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు అడ్మిషన్ పొందుటకు వెంటనే కళాశాల ఆఫీసులో సంప్రదించాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు స్కాలర్‌షిప్ సదుపాయం ఉందన్నారు. కళాశాలలో ఉన్న గ్రూపులు బీఏ పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్, కామర్స్, జనరల్, కంప్యూటర్ కోర్స్, బీఎస్సీ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాశాలలో సుదీర్ఘ అనుభవం కలిగిన అధ్యాపకులతో సక్రమమైన, ప్రణాళికా బద్ధమైన, పోటీతత్వం, కెరీర్ గైడెన్స్‌తో కూడిన విద్యా బోధన అందించబడుతుందన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ కళాశాలలో ఉన్నాయన్నారు.

ఆహారపు అలవాట్లతో బీపీ నియంత్రణ



లూటుకుర్రు పీహెచ్‌సీలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు

మామిడికుదురు: ఆహార అలవాట్ల ద్వారా బీపీని నియంత్రించవచ్చని నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వర్ణలత, రమ్యశైలజ సూచించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం (బీపీ డే)లో భాగంగా శుక్రవారం రెండు పీహెచ్‌సీలో ర్యాలీలు నిర్వహించారు. నేను తరచూ బీపీ చెక్ చేయించుకుంటానంటూ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్లు స్వర్ణలత, రమ్యశైలజ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, శారీరక వ్యాయామం చేయడం ద్వారా బీపీని నియంత్రించుకోవాలన్నారు. తద్వారా గుండె సంబంధిత వ్యాధుల నియంత్రణలో భాగస్వామి కావాలని సూచించారు. ఈ ర్యాలీలో రెండు పీహెచ్‌సీలకు చెందిన ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉల్లాసంగా రజతోత్సవ వేడుక

మామిడికుదురు: అప్పనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల రజతోత్సవ వేడుక శుక్రవారం ఆద్యంతం ఉల్లాసంగా జరిగింది. 1995–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు రజతోత్సవ సమావేశంలో పాల్గొని సందడి చేశారు. నాటి మధుర స్మృతులను మననం చేసుకున్నారు. నాటి చిలిపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్య నేర్పిన గురువులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు తమకు చక్కగా విద్య నేర్పడం వల్లే తాము పలు రంగాల్లో రాణిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ కుటుంబ నేపథ్యాలను సహచరులతో పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా కార్యక్రమంలో పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమం ఆద్యంతం కనుల పండువలా జరిగింది.



అప్పనపల్లిలో రజతోత్సవం సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పారా లీగల్ వలంటీర్ల నియామకం

కొత్తపేట: స్థానిక సీనియర్ అండ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల పరిధిలో పార లీగల్ వలంటీర్ల నియామకం జరుపుతున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ పి.రమణారెడ్డి తెలిపారు. ఆ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ గంధం సునీత ఆదేశాల ప్రకారం పారా లీగల్ వలంటీర్ల నియామకం చేపట్టినట్టు పేర్కొన్నారు. పారా లీగల్ వలంటీర్లుగా పనిచేయుటకు స్థానిక కోర్టు పరిధిలో అభ్యర్థులు తమ బయోడేటాను వచ్చే నెల 10 వ తేదీ లోపు కోర్టులో అందజేయాలని కోరారు.



సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి

ఎక్కడ చూసినా ఎన్నికలపైనే చర్చ



కొత్తపేట: ఓ గ్రామంలో రచ్చబండ చర్చ ఇలా సాగింది.

వెంకన్న: ఒరే రామన్నా.. ఈసారి ఎవరు గెలుత్తారంటావ్...

రామన్న: ఒరే వెంకన్నా.. నాకైతేరా.. మళ్లీ మనెమ్మల్యే నెగ్గుతాడనిపిస్తుందిరా.. వెంకన్న:– అంతేనంటావా.. మరీ.. ఆ వర్గపోళ్లందరూ అవతలి అబ్బేర్థికి కొట్టేశారంటున్నారు.. అయినా మళ్లీ ఈయనే నెగ్గుతాడంటావా..

సోమన్న: ఒరే వెంకన్నా.. ఈ ప్రభుత్వం ఎన్నో పథకాలు పెట్టింది. ఎవరి దగ్గరికీ ఎల్లక్కల్లేకుండా వలంటీరు దోరా డైరెట్టుగా వచ్చాయి కదా.. మనతో పాటు చాలా మంది అందుకున్నారు కదా.. మరి ఓట్లెయ్యరేంటి.. అప్పుడు ఎమ్మెల్లే అబ్బేర్థే నెగ్గుతాడు కదా.. ఇంకా డౌటేంటిరా..

వెంకన్న: నువ్వు చెప్పినట్టు మళ్లీ జగనే సీఎం అవుతాడన్నమాట..

సోమన్న: ఈడేంటిరా.. రాజికీయం అంతా ఇని రాజశేఖరరెడ్డికి జగన్ ఏమవుతాడన్నట్టుంది. నీ డౌటు.. కచ్చితంగా మళ్లీ జగనే సీఎం.

- హోటళ్లు, కిళ్లీ కొట్లు, కిరాణా షాపుల వద్ద సందడి
- ఏ నలుగురు కలిసినా ఎన్నికలపై సమీక్షే

జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉంటాయనే దానిపై ఎక్కడికక్కడ జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. ఎన్నికల్లో ప్రధానమైన పోలింగ్ ఘట్టం ముగిసి నాలుగురోజులైంది. ఇక ఓట్ల లెక్కింపు మిగిలింది. దానికి ఇంకా 18 రోజులు సమయం ఉండగా గెలుపోటములు, మెజార్టీలపై ఉత్కంఠ నెలకొంది. గ్రామాల్లో కూడళ్లు, రచ్చబండలు, హోటళ్లు, కిళ్లీ కొట్లు, సెలూన్లతో పాటు బస్టాపులు, బస్సులు, ఆటోల్లో ఎక్కడ ఏ నలుగురు కలిసినా జరిగిన ఎన్నికలు గురించి, ఎన్నికల ఫలితాల గురించే చర్చ. నియోజకవర్గంలో ఏ అభ్యర్థి గెలుస్తారు? ఎంత మెజార్టీ వస్తుంది? రాష్ట్రంలో ఏ పార్టీ గెలుస్తుంది? ఎన్ని సీట్లు వస్తాయి? అనే దానిపై జోరుగా చర్చోపచర్చలు సాగుతున్నాయి. కొన్ని చోట్ల ఆయా పార్టీల సానుభూతిపరుల మధ్య వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఫలానా పార్టీ అభ్యర్థికే ఎక్కువగా గెలుపు అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ సానుభూతిపరుడు అంటే.. కాదు ఈ పార్టీ అభ్యర్థే గెలుస్తున్నాడు.. అంటూ మరో వ్యక్తి వాదిస్తున్నాడు. గత ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. ఓటర్లు పోలింగ్ ప్రారంభానికి ముందుగానే పోలింగ్ స్టేషన్‌కు చేరుకుని క్యూలో బారులుతీరి నిలబడి ఓర్పుతో ఓటెయ్యడం, వారిలో వృద్ధులు, మహిళలు ఉండటంతో ఫలితం ఏ పార్టీకి అనుకూలంగా ఉంటుందనే దానిపై అంచనాలు వేస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలే కాకుండా రాజకీయాలపై ఆసక్తి ఉన్న అనేకమంది ప్రస్తుత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి, అభ్యర్థుల వ్యక్తిత్వం, వ్యతిరేకత, నగదు, ఇతర పంపిణీలు తదితర అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని అంచనాలు వేస్తున్నారు. నియోజకవర్గంలోనే కాక ఇతర నియోజకవర్గాలలో పరిస్థితిపై కూడా ఆరా తీస్తున్నారు. మీ నియోజకవర్గంలో ఏమిటి పరిస్థితి? ఎవరు గెలుస్తారు? ఎంత మెజార్టీ వస్తుంది? అని వారి వారి బంధువులు, స్నేహితులు, తెలిసిన పరిచయస్తులకు ఫోన్లు చేసి మరీ తెలుసుకుంటున్నారు. నియోజకవర్గంలో, రాష్ట్రంలో వివిధ సామాజిక వర్గాల వారీగా కూడా అంచనాలు వేసుకుంటూ ఎవరికి వారే గెలుపు ధీమాతో ఉన్నారు. జిల్లాలో, రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన వైఎస్సార్ సీపీ, టీడీపీ కూటమికి ఎన్ని సీట్లు వస్తాయన్న దానిపై చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ఏ పార్టీకి ఆ పార్టీ జిల్లాల వారీగా గెలిచే సీట్లు జాబితా బయటకు రాగా పరిశీలకులు తమ పరిశీలనతో ఆయా పార్టీలు కచ్చితంగా గెలిచే సీట్లను టిక్ పెడుతున్నారు.

వైఎస్సార్ సీపీకి 'సంక్షేమ' ధీమా..

గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ప్రభావం ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా కనిపించిందని పరిశీలకులు చెబుతున్నారు. దానితో అత్యధికంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం సాధించడం ద్వారా ఆ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని వాదన ఎక్కువగా వినిపిస్తుంది. పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలకు మేలు చేకూర్చే విధంగా సీఎం జగన్ పరిపాలన కొనసాగించిన విషయం తెలిసిందే. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేద ప్రజల కోసం ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిందిలేదు. ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే వారికి మేలు చేకూర్చింది. ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనితీరుపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారు. తాజాగా జరిగిన పోలింగ్‌లోనూ ఇదే అంశం ప్రస్ఫుటమైనట్లు పరిశీలకులు భావిస్తున్నారు. గ్రామాల్లో పోలింగ్ సరళిని పరిశీలిస్తే మహిళలు, వృద్ధులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ ఓటు బ్యాంకు అంతా వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉండటంతో ఆ పార్టీ అభ్యర్థుల గెలుపు నల్లేరుపై నడకేనని రాజకీయ విశ్లేషకులు అంచనాకు వచ్చారు. కొన్నిచోట్ల పందాలు కూడా జరుగుతున్నట్టు సమాచారం. జిల్లాలోనే ఏ నియోజకవర్గంలోనూ లేని విధంగా ఈ నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించామని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, దానితో గత మెజార్టీకి మించి ఓట్ల అధిక్యతతో హ్యాట్రిక్ సాధిస్తామని వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.